క్లుప్తంగా

క్రీస్తు విశ్వాసుల శిలువ యాత్ర



తోట్లవల్లూరు: క్రీస్తు చూపిన సన్మార్గం ఆచరణీయమని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మద్దల వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులో క్రీస్తు విశ్వాసులు గురువారం సాయంత్రం శిలువయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట క్రీస్తు గీతాలను ఆలపిస్తూ శిలువ యాత్ర జరిపారు. ఫాదర్ మద్దల వరప్రసాద్ దైవ సందేశం వినిపించారు. సహాయ గురువు గోలి బాలస్వామి, సంఘ ప్రముఖులు వల్లూరు సుదర్శనరావు, మరియు దళ సభ్యులు, దీక్ష సభ్యులు పాల్గొన్నారు.

వేగంగా జాతీయ రహదారి విస్తరణ పనులు



మండవల్లి: జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గుడివాడ–భీమవరం మధ్య గల రహదారిపై గురువారం మండవల్లి వద్ద రోడ్డు విస్తరణ పనులు నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగరాజు మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో హైవే విస్తరణ పనులు పూర్తవుతాయన్నారు. రహదారి విస్తరణ పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు.

నేడు మొవ్వలో వలంటీర్లకు వందనం

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య కల్యాణ మండపంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్ కుమార్ పాల్గొంటారని, సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లకు సత్కారాలు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పిలుపు నిచ్చారు.

మండలాభివృద్ధికి సమష్టి కృషి చేద్దాం



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి పనిచేద్దామని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మండలంలో మొత్తం 55 అంశాలకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు మండల పరిషత్ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, కొప్పుల జయరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫత్తేలంకలో గడపగడపకు మన ప్రభుత్వం


పమిడిముక్కల: మండలంలోని ఫత్తేలంక గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు. అమీనాపురం గ్రామంలో మధ్యాహ్నం 2 గంటలకు పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తారని, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి ఫత్తేలంకలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కొనసాగిస్తారని తెలియజేశారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెద్దింట్లమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.8,05,944

కైకలూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవాలయంలో గురువారం అమ్మవారి హుండీ కానుకల ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం 66 రోజులకు గానూ అమ్మవారికి రూ.8,05,944 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు తెలిపారు. దేవదాయ శాఖ గుడివాడ పర్యవేక్షణాధికారి వి.సుధాకర్ ఆధ్వర్యంలో కానుకలను లెక్కించారు.

సంక్షేమ రాజ్యమే ధ్యేయం కావాలి

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)



గురజలో వృద్ధురాలిని అక్కున చేర్చుకుని మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: పేదల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడానికి ప్రజలంతా మద్దతు పలకాలని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి మండలంలోని పెనుమల్లి, సంఘర్షణపురం, గురజ గ్రామాల్లో గురువారం ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని పేదల సమస్యలన్నీ దశల వారీగా తొలగిపోయాయన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రధాన కారణమని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వ హయంలోనూ లేని విధంగా సంక్షేమ ఫలాలను పారదర్శకంగా, అవినీతి రహితంగా నేరుగా ప్రజలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేస్తుండడంతో రాజకీయంగా ఉనికిని కోల్పోతామనే భయం ప్రతిపక్ష నేతల్లో ఏర్పడిందన్నారు. దీనితో దిక్కుతోచని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా విమర్శించారు. ఎన్నికలు సమీపించే కొద్దీ ప్రతిపక్ష నేతలు ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజల ముందుకు వచ్చే ప్రమాదముందని, బూటకపు హామీలను నమ్మవద్దన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సైతం సమాన ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. శాసనసభ్యునిగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాను చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తించి తనను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఏనాడు పట్టించుకోని పెత్తందారులు, ప్రతిపక్ష నాయకులు ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రజలను వంచన చేసి రాజకీయ లబ్ధి పొందడానికి కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి వారిని తరిమికొట్టి వైఎస్సార్ సీపీకే విజయం చేకూర్చాలన్నారు. యాత్రలో భాగంగా భారీ సంఖ్యలో కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులిచ్చి స్వాగతం పలికి మద్దతు తెలిపారు. గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు రాచూరి రాధ, చొప్పర్ల సునీత, గురజ సొసైటీ అధ్యక్షుడు మేడూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, పుట్టి సుబ్బారావు, మరీదు వసంతరావు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద యాత్రకు మద్దతుగా కార్యకర్తల భారీ ర్యాలీ

వలంటీర్లు రథసారథులు



వలంటీరును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంలో వలంటీర్లు రథసారథుల్లా వ్యవహరిస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. నందివాడ మండలంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొని వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అన్నారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అనేక సేవలు వలంటీర్ల ద్వారా సచివాలయాల నుంచి ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. నవరత్నాలు పథకాల అమలులో వలంటీర్ల పాత్ర ఎంతో ప్రధానమైనదన్నారు. ఇంత ఉత్తమ సేవ చేస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం చిరుసత్కారం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నందివాడ మండలంలో 223 మంది గ్రామ వలంటీర్లు ఉండగా ఒకరికి సేవా వజ్రం, అయిదుగురికి సేవా రత్న, 217 మందికి సేవామిత్ర పురస్కారాలు అందించామన్నారు. మొత్తం రూ.34 లక్షల 50 వేలు నగదు పురస్కారాలతో పాటు చిరు సత్కారాలు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి. శ్రీనివాసరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, కె.జయరాజు, నందివాడ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయాల ఇన్‌చార్జ్ దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, కె.రంగారెడ్డి, కందుల నాగరాజు, తోట నాగరాజు, సరెళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ వంశీ

కలిదిండి: పాతాళ భోగేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు సూచించారు. తహసీల్దార్ వంశీ ఆధ్వర్యాన ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ, రెవెన్యూ, ఫైర్, పోలీస్, వైద్య తదితర శాఖల అధికారులతో శివరాత్రికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. లక్ష మందికి పైగా తరలి వచ్చే భక్తజనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, ఎస్‌ఐ ప్రియకుమార్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, సర్పంచ్ మసిముక్కుల మారుతీ ప్రసన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టూరి బుజ్జి, చిట్టూరి శ్రీనివాసరావు, పాము రవికుమార్, మసిముక్కుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఈదులమద్దాలి(పెదపారుపూడి): రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి మరోసారి పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఈదులమద్దాలి గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే కొండంత బలం అని అన్నారు. కార్యకర్తలను పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు దేశంలో ఇంతవరకు ఎవరూ అందించలేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు.

టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

ఈదులమద్దాలి గ్రామంలో జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు దొండపాటి రాంబాబు, గోళ్ళ సోమేశ్వరరావు, తుమ్మల కోటేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, సర్పంచ్‌లు వంగర హిమబిందు, నాగదేశి సుబ్రహ్మణ్యం, జువ్వనపూడి రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. స్వామివారికి 108 కలశాలతో వేద పండితులు ప్రత్యేక పూజాభిషేకాలను చేపట్టారు. స్వామివారు వివిధ రకాల పుష్పాలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితులు హోమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

కరుణామయుని ఆశీస్సులు అందరికీ ఉండాలి



మండవల్లి: కరుణామయుని ఆశీస్సులు అందరికీ ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆకాంక్షించారు. మండలంలోని లోకుమూడి ఆర్సీఎం చర్చిలో గురువారం ఏసు ప్రభువు శిలువ మార్గ యాత్ర సన్నద్ధత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 40 రోజులు ఉపవాస దీక్ష ముగించిన వారందరికీ ఆశీర్వచనాలు తెలిపారు. మత గురువులు, మత పెద్దలు ప్రార్థనలతో ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సంఘ కాపరి యేసయ్య మాస్టర్, ఫాదర్ బొడ్డు వినయ్, ఉప సందేశకులు సింధుబాబు, తలారి రాజేష్, సంఘ పెద్దలు, సంఘ కాపరులు, సంఘస్తులు పాల్గొన్నారు.

మినప పంటపై రైతులకు అవగాహన



మండవల్లి: పెరికెగూడెంలో జిల్లా వనరుల కేంద్రం అధికారులు గురువారం మినప పంటపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటమణి మాట్లాడుతూ మినప పంటలో వచ్చే రసం పీల్చే పురుగు సస్యరక్షణ చర్యలను వివరించారు. డీఆర్సీ ఏవో ఉష మాట్లాడుతూ మినపలో ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకు సూచనలు చేశారు. ఏఏఓ మాట్లాడుతూ రబీలో మినప సాగు చేసిన రైతులంతా రేపటిలోగా ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు గ్రామంలో మినప చేను పరిశీలించారు.

ఘనంగా మొహిబుల్లాషా చిష్తి 80వ ఉరుసు మహోత్సవం

- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక
- గ్రామంలో నెలకొన్న పండుగ వాతావరణం



ఉరుసు సందర్భంగా దర్గా వద్దకు పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకువస్తున్న ముస్లింలు

పామర్రు: స్థానిక హజరత్ జియావుల్ హక్ షీమా అల్లా మొహిబుల్లాషా చిష్తి వారి 80వ ఉరుసు మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వమానవ సౌభ్రాతృత్వానికి అందరూ కలిసి శాంతి సహనాలతో సేవలను అందించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఉరుసు మహోత్సవం సందర్భంగా పూజా సామగ్రిని, గంధం తదితరాలను గ్రామంలోని పుర వీధుల వెంబడి మేళ తాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ప్రతి ఒక్కరూ దయ, క్షమ గుణాలను కలిగి తోటి వారిని ప్రేమించాలని కోరుతూ దర్గా వద్ద గులాబీలు బంతి పువ్వులతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తదుపరి నూతన వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ఉరుసు మహోత్సవ నిర్వాహకులు ఆలీ ఆసిఫ్ ఖాన్, ఆలీ ఆప్తాబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం దర్గా వద్ద నందా ఫాతిమా తదుపరి హజరత్ మొహబుల్లా షిష్తి ప్రసాదం అందరికీ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం దర్గాలో నిర్వహించిన ఖవ్వాలీ పాటల కచేరీ కార్యక్రమం ఆహూతులను రంజింప చేసింది.

కాలక్షేప మండపం ప్రారంభం



కాలక్షేప మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంకు అనుబంధంగా నిర్మించిన కాలక్షేప మండపాన్ని గురువారం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కార్యక్రమాలు నిర్వహించుకునే వారికి తక్కువ ఖర్చుతో శుభకార్యాలు జరుపుకొనే వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం ఫంక్షన్ హాలు ధరలు అధికంగా ఉండటంతో పేదవారికి ఇది ఎంతగానో అందుబాటులో ఉంటుందన్నారు. పేదవారిని దృష్టిలో ఉంచుకుని ఇది నిర్మించామని ప్రజలు దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓలు వీడీడీ ప్రసాదు, నటరాజన్ షణ్ముగం, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్ల శ్రీను, ఎంవీ నారాయణరెడ్డి, పండు, చందరాల హరి రాంబాబు, ఆలయ పాలక వర్గ అధ్యక్షుడు గంటా చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులు బి.సూర్యనారాయణ, తాతా రజనీ కుమారి, ఎ.భారతి, పి.రాధిక, బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి ఏర్పాటుకు చర్యలు



రహదారి పనులను ప్రారంభిస్తున్న స్థానిక మహిళలు, పక్కనే అధికారులు, నాయకులు

పామర్రు: రహదారి పనులు చురుగ్గా నిర్వహించి పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈఈ శ్రీనివాస్ అన్నారు. స్థానిక బాపూజీ పేట 20వ వార్డులో జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రహదారి పనులను గురువారం స్థానిక మహిళలతో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో సుమారు 150 మీటర్ల వరకు సీసీ రహదారి పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్ కుమార్ నాయకత్వంలో జిల్లా పరిషత్ నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో సీసీ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ రహదారి నిర్మాణం వలన స్థానిక ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ ధర్మయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయి, పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం

పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

పామర్రు: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక 15, 16 వార్డులలో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులు రూ.22 లక్షలతో మూడు సీసీ రహదార్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు చెప్పారు. 16వ వార్డులో ఒకటి, 15వ వార్డులో రెండు రహదార్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. గ్రామాల్లో ప్రతి రహదారిని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, సుబ్బారెడ్డి, మోరా వెంకట్‌రెడ్డి, పెద వెంకట రెడ్డి, చిన్న వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఎంఈవో సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



యాజమాన్య హక్కు ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. మండలంలోని సంఘర్షణపురం, పెనుమల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటే లభ్యమవుతున్నాయన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న భూవివాదాలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరడంతో పాటు పూర్తి స్థాయి యాజమాన్య హక్కులు ఉంటాయన్నారు. గ్రామంలోని 300 మందికి మంజూరైన యాజమాన్య భూహక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. రాబోయే ఎన్నికల్లో తనతో పాటు ఏలూరు పార్లమెంటు అభ్యర్థిగా పార్టీ తరఫున పోటీ చేస్తున్న కారుమూరి సునీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లాభక్షు, ఈడే వెంకటేశ్వరరావు, నాగరాజు, ముంగర గోపాలకృష్ణ, కన్నా రమేష్, బత్తిన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరుని శాంతి కల్యాణం



కైకలూరులో రామలింగేశ్వరుని శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన ప్రముఖులు

కైకలూరు: రామలింగేశ్వరుని నామస్మరణతో కైకలూరు శ్యామలాంబ ఆలయ ప్రాంగణం గురువారం మార్మోగింది. త్రయాహ్నిక దీక్షతో రామేశ్వర, రామలింగేశ్వర వార్షిక శాంతి కల్యాణోత్సవాన్ని యాజ్ఞిక బ్రహ్మ గొర్తి వెంకట రమణ, అర్చకులు చావలి సూర్యనారాయణమూర్తి, గోపాలకృష్ణమూర్తి నిర్వహించారు. స్థానిక ప్రముఖ న్యాయవాదులు గొర్తి ప్రభాకర దీక్షితులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు కల్యాణ క్రతువును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బూరుబోయిన మోహనరావు, ధర్మకర్తలు, గ్రామ ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హంసలదీవి సముద్రస్నానాలకు ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని కోడూరు మండలం హంసలదీవి సముద్రస్నానాలకు వెళ్లే భక్తుల కోసం ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. అవనిగడ్డ డిపో నుంచి హంసలదీవికి ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచి 24వ తేదీ సాయంత్రం వరకూ ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని చెప్పారు. భక్తులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): ప్రభుత్వం తమ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఆలోచన నుంచి వచ్చిన వ్యవస్థ సచివాలయ వ్యవస్థ అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. నందివాడ మండలం రుద్రపాక గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఏ అవసరం ఉన్నా రోజుల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న సంకల్ప యాత్రలో ప్రజలు చెప్పిన సమస్యలను అర్థం చేసుకుని వారికి ప్రభుత్వ సేవలు చేరువ కావాలనే సంకల్పంతో ఈ సచివాలయాలు ఏర్పాటు చేశారని అన్నారు. ప్రజల చెంతనే కార్యాలయాలు ఉండాలనే ఈ సచివాలయాలను నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, సర్పంచ్ జంగం రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, ఎంపీటీసీ సభ్యులు గుత్తా సత్యన్నారాయణ చౌదరి, పిట్టా విశ్రాంతం పాల్గొన్నారు.